క్లుప్తంగా

సారా రహిత సమాజానికి కృషి



మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు

హిరమండలం: సారా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు కోరారు. మండలంలోని ఎగువ రుగణ గ్రామంలో 'సారా రహిత ఆంధ్రప్రదేశ్' నిర్మాణంలో దిశగా నవోదయం 2.0 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకంతో పాటు నాటుసారా సేవించడం వలన కలిగే నష్టాపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారా నిర్మూలన కోసం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్ మణేశ్వరి, ఎస్ఐ షర్మిళ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ కోరారు. పట్టణ ప్రధాన రహదారిపై మున్సిపల్ సిబ్బంది, పలువురు వ్యాపారులతో కలిసి ప్లాస్టిక్ వినియోగం వలన వచ్చే నష్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పాలిథిన్ నిషేధానికి కట్టుబడి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శి సింహాచలం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న దృశ్యం

పోలాకి: మండలంలోని వనితమండలం వద్ద వంశధార నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన పనులను ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ నయీముల్లా, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు శుక్రవారం పరిశీలించారు. వంతెన నిర్మాణం సకాలంలో పూర్తిచేసేలా చూడాలన్నారు. అందుకు తగినట్లు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పశు వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస పశుసంవర్ధకశాఖ ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. మున్సిపాలిటీ పరిధి 16వ వార్డు దాబాలవారి వీధిలో పశువులకు ఉచిత గాలికుంటు మరియు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు శుక్రవారం వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది రాకోటి స్వాతి, ఆస్పత్రి అటెండెంట్ జల్లేపల్లి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని 13,200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.కరుణకరరావు అన్నారు. మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో పశువులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి టీకాలను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పెద్దలొగిడి పశు వైద్యులు పి.అనిల్, అంపోలు మధు, యారబాటి సన్యాసిరావు, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ధరలు పెంచాలి



మాట్లాడుతున్న అధ్యక్షురాలు మహాలక్ష్మి

పాతపట్నం: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి ధరలు పెంచాలని జిల్లా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వంట కార్మికులతో మండల స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీన విజయవాడలో చేపట్టనున్న ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రం ప్రభుత్వం కార్మికులకు రూ.3 వేల వేతనమిస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి టి.సీతమ్మ, కమిటీ సభ్యులు ఎస్.గీతాబాల, కుమారి, దుర్గమ్మ, పార్వతీ, అమ్ముడమ్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చివరికి నీటిగండం..!




పెద్దకోట సమీపంలో ఎండిపోయిన పంట పొలాలు

- ఆఖరి తడి అందక ఎండిపోతున్న చేను
- వరి, మొక్కజొన్నపై ఆశలు ఆవిరి
- ఆందోళన చెందుతున్న అన్నదాత



ఎండిపోయిన అసర్లవాని చెరువు



కృష్ణాపురం సమీపంలో బీటలువారిన పంట పొలం

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది రబీ సీజన్‌లో **వరి, మొక్కజొన్న** సాగు చేసిన రైతులకు కష్టాలు **తప్పడం** లేదు. అప్పులు చేసి పంట కోసం పెట్టుబడి పెట్టిన రైతులు ఆఖరి తడికి సాగునీరు లేక ఆందోళన చెందుతున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో పంటలు వేసుకున్న రైతులు సాగునీరు అందించేందుకు అవస్థలు పడుతున్నారు. జనవరి నెల నుంచి ఇప్పటి వరకు ఇంజిన్ల ద్వారా సాగునీరు అందించి పంటను కాపాడుకుంటూ వచ్చారు. అయితే ప్రస్తుతం చెరువులు, కాలువలు ఎండిపోవడంతో పంట ఆఖరి **తడికి సాగునీరు** అందించలేక దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. మరికొన్ని రోజుల్లో పంట చేతికొస్తుందనే సమయంలో ఇలాంటి దుస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

వంశధార ద్వారా అందని నీరు

ప్రతీ ఏడాది మార్చి నెలాఖరు వరకు వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందేది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికే సాగునీరు అందించలేని దుస్థితి ఏర్పడడంతో కూటమి ప్రభుత్వ తీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా మార్చి వరకు సాగునీరు అందించారు. కుడి ప్రధాన కాలువ ద్వారా జనవరి నెలాఖరు నాటికే సాగునీరు అందివ్వలేని దుస్థితి ఏర్పడిందని రైతులు చెపుతున్నారు. కనీసం ఫిబ్రవరి వరకు అయినా కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందిస్తారనే ఆశతో రైతులు విస్తారంగా పంటలు వేసుకున్నారు. పాలకులు, అధికారులు సాగునీరు ఇవ్వలేని దుస్థితిలో ఉంటారని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో...			
మండలం	వరి సాగు (ఎకరాల్లో..)	మొక్కజొన్న సాగు (ఎకరాల్లో..)	రైతులు
ఎల్.ఎన్.పేట	2,150	700	3,500
పాతపట్నం	1,050	800	2,600
కొత్తూరు	1,600	550	2,800
మెళియాపుట్టి	800	600	1,250
హిరమండలం	950	750	1,160

పంట ఎండిపోయింది



మా ఊరులో నాతో పాటుగా ఎంతో మంది రైతులు ఈ ఏడాది రబీలో వరి వేసుకున్నాం. జనవరి నెల నుంచి సాగునీటికి ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఇంజిన్ల ద్వారా ఇప్పటివరకు సాగునీరు అందించాం. పంట ఆఖరు దశకు వచ్చింది. చెరువులు, కాలువలు నీరు లేకుండా ఎండిపోయాయి. కొన్ని రోజులుగా నీరులేక పంట కూడా ఎండిపోతోంది.

– పైడి అచ్యుతరావు, తురకపేట, ఎల్.ఎన్.పేట

ప్రభుత్వమే ఆదుకోవాలి



రబీలో సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న పంటలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. మరికొన్ని రోజుల్లో పంట దిగుబడులు చేతికి అందివస్తాయని ఆశగా ఎదురు చూస్తున్న సమయంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. రైతులకు అప్పులే మిగిలాయి. పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలి.

– పల్లి అప్పలనాయుడు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

నీటి నిల్వలు తగ్గిపోయాయి

వంశధార నది, రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. జనవరి నెలాఖరు నాటికే నీరు తగ్గినప్పటికీ రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించేందుకు ప్రయత్నాలు చేశాం. గత కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడం వలన ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి.

– కె.ధనుంజయ, జేఈ, వంశధార


నిరుపయోగం



బూర్జ మండలంలోని పీఎల్‌దేవిపేట పంచాయతీ గోపిదేవిపేట గ్రామంలో ఏన్నో ఏళ్ల క్రితం నిర్మించిన సామాజిక భవనం పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా మారింది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ సీతంపేట వారి ఆర్థిక సహకారంతో రూ.10 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. అందువలన అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– బూర్జ

దాహం కేకలు



సరుబుజ్జిలి మండలంలోని పాలవలస పంచాయతీ పరిధి చినవెంకటాపురం గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకానికి రన్నింగ్ వాటర్‌ను అందించే పంప్‌హౌస్‌కు చెందిన విద్యుత్ మోటార్ పనిచేయడం లేదు. దీనివలన తాగునీటికి కటకటలాడుతున్నామని వాపోయారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో గత్యంతరలేక చెరువు నీటిని అవసరాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

– సరుబుజ్జిలి

వైభవంగా చక్రతీర్థ స్నానాలు



హిరమండలం: జనసంద్రంగా మారిన వంశధార నది

కొత్తూరు: అయ్యప్ప స్వామి జన్మదినోత్సవం పురస్కరించుకొని కొత్తూరులో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఎస్ఎస్ కాలనీలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్థానిక హరిదాసు కొనేరులో విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలాచరించారు.

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం సుభలయ సమీపంలోని మెట్ట (తపోగిరి)పై వెలసివున్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు వైభవంగా చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేపట్టారు.

జలుమూరు: డోలోత్సవం పురస్కరించుకొని శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలు వంశధార నదిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో దక్షిణముఖంగా మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగించారు. మహిళలు, భక్తులు స్వామివారికి హారతులు ఇవ్వగా, అనంతరం వంశధార నదీతీరాన తూర్పుముఖంగా స్వామివారికి చక్రతీర్థస్నానాలు చేయించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను ఆలయంలో ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: పార్వతీ పరమేశ్వరులకు చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న దృశ్యం



కొత్తూరు: అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న భక్తులు

ఆధ్యాత్మిక చింతన అవసరం



తమ్మినేనికి సీతారాముల చిత్రపటం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఆమదాలవలస రూరల్: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గరిమెల్ల కొత్తవలసలో ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీతారాముల ఆలయాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మృతి



ఉదయలక్ష్మి

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఉదయలక్ష్మి(53) శుక్రవారం మృతి చెందారు. స్వగ్రామం ఏలూరులోని స్వగృహంలో గుండెపోటుకు గురయ్యారు. ఆస్పత్రికి తరలించేసరికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీనియర్ అధ్యాపకురాలిగా జోన్–2లో పనిచేసిన ఉదయలక్ష్మి పదోన్నతిపై పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగంలో చేరారు. కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. ప్రిన్సిపాల్ మృతిపై కళాశాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

హిరమండలం: అధికారులు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మేరీ కేథరిన్ సూచించారు. మండలంలోని హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించారు. అనంతరం సుభలయ, ఆర్అండ్ఆర్ కాలనీల్లోని పలు వీధుల్లో పర్యటించారు.

కండరాల బలహీనత, నొప్పులతో ఎవరైనా బాధపడుతున్నట్లయితే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్‌కు సూచించారు. ఆమెతో పాటు హెచ్‌వీ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు విరమించుకోవాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి బలరాం

ఆమదాలవలస: ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని జిల్లా మున్సిపల్ కార్మికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం కోరారు. పట్టణంలోని ఐజేనాయుడు కాలనీలో మున్సిపల్ కార్మికుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి దళారి వ్యవస్థకు అప్పగించాలని ప్రయత్నాలు చేస్తోందని, ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని విరమించుకోకపోతే పోరాటాలు తప్పవన్నారు. విధుల్లో మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్మికులను నియమించి పనిభారం తగ్గించాలని కోరారు. సమావేశంలో పట్టణ మున్సిపల్ యూనియన్ నాయకుడు తాడి సంతోష్ కుమార్, కె.తారక్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

డోలో పౌర్ణమి పురస్కరించుకొని ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు బారులుతీరారు. పలుచోట్ల కల్యాణోత్సవాలు, కుంకుమ పూజలు, హోమాలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పోలాకి: ప్రియాగ్రహారంలో పూజలు నిర్వహిస్తున్న ధర్మాన పద్మప్రియ తదితరులు



మెళియాపుట్టి: వేణుగోపాల స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న రాణి కల్యాణి దేవి గజపతి



కొత్తూరు: వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో కుంకుమపూజలు



పొందూరు: కంచి కామాక్షి ఆలయంలో కుంకుమ పూజలు



హిరమండలం: జగన్నాథస్వామి ఆలయం వద్ద అన్నదానం

హోలీ..ఆనంద కేళీ

హోలీ పండుగను ప్రజలు శుక్రవారం ఆనందంగా జరుపుకున్నారు. చిన్నా..పెద్దా తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ సందడిగా గడిపారు. అలాగే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: బీసీ బాలికల వసతి గృహంలో...



ఆమదాలవలస రూరల్: దూసిపేట గ్రామంలో...



పాతపట్నం: ఎగువ కంద్రవీధిలో...



ఆమదాలవలస: హోలీ వేడుకల్లో మార్వాడీలు



కొత్తూరు: రంగులు రాసుకుంటూ సరదాగా గడుపుతున్న చిన్నారులు



సారవకోట: హోలీ ఆడుతున్న చిన్నారులు



ఆమదాలవలస: నృత్యాలు చేస్తున్న మార్వాడీ మహిళలు



హిరమండలం: చిన్నారుల సందడి

మకరతోరణం వితరణ

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి ఆ గ్రామానికి చెందిన తండ్యాల జగన్నాథరావు దంపతులు మకరతోరణం వితరణగా శుక్రవారం అందజేశారు. ఆలయంలో ప్రధాన మూలవిరాట్‌కు, ఇతర విగ్రహాలకు ఏర్పాటు చేసేందుకు రూ.70 వేల విలువ కలిగిన మూడు మకర తోరణాలు అందించారు.